క్లుప్తంగా

వేడుకగా పోలేరమ్మ కొలుపులు



కారంచేడులో పోలేరమ్మ తల్లి కొలుపుల్లో యువత, భక్తులు

కారంచేడు: ప్రతి ఏటా సాగుకు ముందు గ్రామ దేవత పోలేరమ్మ తల్లికి కొలుపులు నిర్వహించడం ఆనవాయితీ. దీనిలో భాగంగా ఈ ఏడాది వ్యవసాయ పనులు ప్రారంభానికి ముందుగా గ్రామంలోని యజ్ఞశాలపేటలో కొలుపులను ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం అమ్మవారికి పొంగళ్లు నైవేద్యంగా సమర్పించారు. సాయంత్రం గ్రామ దేవతను ప్రత్యేకంగా అలంకరించిన ప్రత్యేక వాహనంపై ఉంచి ఊరేగించారు. యువతీ, యువకులు వీరతాళ్లతో అమ్మవారి ప్రతిమకు ముందు నృత్యాలు చేశారు.

జామాయిల్‌కు గిట్టుబాటు ధర

● రాష్ట్ర ప్రభుత్వ చర్యలపై రైతుల హర్షం



ఉలిచి రోడ్డులో లారీకి జామాయిల్ కర్ర లోడ్ చేస్తున్న కూలీలు



జామాయిల్ కర్రకు తాట తీస్తున్న కూలీలు

ఒంగోలు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలతో జామాయిల్ పంటకు గిట్టుబాటు ధర లభిస్తుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నాలుగేళ్లుగా సమృద్ధిగా వర్షాలు కురుస్తుండటంతో పాటు రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు సర్వం సమకూరుస్తున్నారు. అందులో భాగంగా జామాయిల్ తోటలు సాగుచేసే రైతులకు వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బంది ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు అందించారు. దుక్కి దున్నే మొదలు మొక్కకు మొక్కకు మధ్య, వరుసకు వరుసకు మధ్య రెండడుగుల గాడి ఏర్పరచడం, భారీ వర్షాల సమయంలో తోటల్లో నీటి నిల్వ చేయడం వంటి అన్ని అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. వర్షాల సమయంలో 15 రోజులు నీరు ఉంచడం, మరో 15 రోజులు భూమి తడిబారి ఉండటం వంటి చర్యలతో మేలు జరిగింది.

దీంతో సంవత్సరం వయసున్న జామాయిల్ తోట కూడా రెండు సంవత్సరాల వయసున్న తోటలా ఏపుగా, లావుగా పెరిగిపోయింది. గత 9 సంవత్సరాలుగా జామాయిల్ రైతులు, సరివితోట రైతులు కర్రకు గిట్టుబాటు ధర కావాలంటూ రోడ్డెక్కిన పరిస్థితులు ఉండేవి. అలాంటి స్థితి నుంచి ప్రస్తుతం వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో రైతులకు అన్నీ అందించడం నుంచి గిట్టుబాటు ధర కల్పించేంత వరకూ సర్కారే చూసుకుంది. సంవత్సరంలో 9 నెలలు వర్షాలు కురవడంతో నాలుగేళ్లకే జామాయిల్ తోటలు ఆశించిన దాని కంటే మంచి సైజుకు వచ్చాయి.

గతంలో ఎప్పుడూ లేనంతగా ధరలు...

గత ఆరేళ్ల తోటలు ఉన్నా ఎవరూ కొనని స్థితి నుంచి నేడు జామాయిల్ తోటలకు రెండేళ్ల ముందే అడ్వాన్స్‌లు ఇస్తున్నారంటే.. గిరాకీని అర్థం చేసుకోవచ్చు. ఒంగోలు రూరల్‌లోని తీరప్రాంత గ్రామాల నుంచి రోజూ సాయంత్రం 10 నుంచి 15 టర్బో లారీలు పేపర్ మిల్లులకు వెళ్తున్నాయంటే జామాయిల్ తోటల నుంచి ఎగుమతులు ఏ విధంగా ఉన్నాయో తెలుస్తోంది. తీరప్రాంత గ్రామాల నుంచి వచ్చే టర్బో లారీలను, ఎంటీ లారీలను కాటా వేసేందుకు వలేటివారిపాలెంలో లారీ కాటా మిషన్ ఏర్పాటు చేశారు. రూ.30 వేలు పెట్టి కొన్న ఎకరా జామాయిల్ తోటకు 10 టన్నుల కర్ర, రూ.50 వేలు పెట్టి కొన్న తోటకు 25 టన్నులు, రూ.70 వేలు పెట్టి కొన్న తోటకు 40 టన్నుల జామాయిల్ కర్ర వస్తోంది. టన్ను రూ.5,200 కాగా, ఖర్చులు రూ.640, ట్రాక్టర్ బాడుగలు రూ.1,200, డీబార్జి మిషన్ ద్వారా తాటా తీసేందుకు ఒక లారీకి రూ.4000 చెల్లించాల్సి ఉంది. నికరంగా సుమారు రూ.3 వేలకుపైగా లభిస్తోంది. దీంట్లో కాటా మిషన్, ట్రాక్టర్ బాడుగులు, ఇతర ఖర్చులు అదనం. మొత్తం మీద జామాయిల్ రైతులు నేటి ప్రభుత్వం తీసుకున్న చర్యలతో మంచి లాభాల బాట పట్టడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

తక్కువ ఖర్చుతో వైద్యసేవలు

ఒంగోలు టౌన్: దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారికి తక్కువ ఖర్చుతో వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా దాచూరి రామిరెడ్డి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేస్తున్నట్లు క్యాంపు కన్వీనర్ మాదాల వెంకటరావు తెలిపారు. స్థానిక నెల్లూరు బస్టాండ్ సెంటర్లోని డీఆర్ఆర్ఎం హైస్కూల్ ఆవరణలో ఆదివారం ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపులో ఆయన మాట్లాడారు. ఈ క్యాంపులో రక్తపోటు, మధుమేహం, పక్షవాతం, మూర్ఛ, తదితర వ్యాధులకు సుశిక్షితులైన వైద్యులతో చికిత్స చేయించారు. సుమారు 1400 మందికిపైగా వైద్యసేవలు అందించారు. కేవలం రూ.200కే రెండు నెలలకు సరిపడా మందులు, అతి తక్కువ ధరకే ఇన్సులిన్ అందించామన్నారు. మెడికల్ క్యాంపు నిర్వహణకు విరాళం అందజేసిన రాపర్ల వాస్తవ్యుడు అన్నెం వెంకటరామిరెడ్డి, చీమకుర్తికి చెందిన డాక్టర్ జవహర్‌కు ధన్యవాదాలు తెలిపారు. ప్రముఖ వైద్యులు గోపాళం శివన్నారాయణ, బి.హరిబాబు, ఎల్.జాన్ రిచర్డ్స్, చాపల వంశీకృష్ణ, ఎస్.ధీరజ్‌బాబు, సందీప్ ప్రకాశ్, జి.చైతన్య, ఎం.రవితేజ, పి.చైతన్య తదితరులు సేవలందించారు.

పోలవరం పోరుకేకకు సంఘీభావం



కార్యక్రమంలో పాల్గొన్న ప్రకాశం జిల్లా నేతలు

ఒంగోలు టౌన్: పోలవరం నిర్వాసితులకు పరిహారం అందించాలని కోరుతూ పోలవరం పోరుకేక పేరుతో జూన్ 20వ తేదీ ప్రారంభమైన పాదయాత్రకు ప్రకాశం జిల్లా వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు సంఘీభావం ప్రకటించారు. ఆదివారం హనుమాన్ జంక్షన్‌కు చేరుకున్న పాదయాత్రలో పాల్గొన్న ఆ సంఘ జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు ఒక ప్రకటన విడుదల చేశారు. ఆర్ఆర్ ప్యాకేజీ కింద నిర్వాసితులందరికీ భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం ప్యాకేజీ ఇవ్వాలని కోరారు. తాము పుట్టి పెరిగిన ఊరిని, పొలాలు, స్థలాలతో పాటుగా నీడనిచ్చిన ఇళ్లను కోల్పోయిన నిర్వాసితులను ఆదుకోవడం బాధ్యతని గుర్తుచేశారు. పాదయాత్ర బృందానికి ప్రకాశం జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం తరఫున రూ.5 వేలు అందజేశారు. ఈ బృందంలో జిల్లా నాయకులు కేజీ మస్తాన్, కంకణాల వెంకటేశ్వర్లు, వెల్లంపల్లి ఆంజనేయులు పాల్గొన్నారు.

విశ్వనాథం స్నేహం మరువలేనిది

● కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం



మాట్లాడుతున్న కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం

ఒంగోలు అర్బన్: రావినూతల విశ్వనాథం మాస్టారు స్నేహం మరువలేనిదని కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం అన్నారు. స్థానిక ఎన్‌టీఆర్ కళాక్షేత్రంలో క్రియేటివ్ కల్చరల్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం విశ్వనాథం సంస్మరణ సభ నిర్వహించారు. జేడీ శీలం హాజరై నివాళులర్పించి మాట్లాడారు. సీఎస్ఆర్ శర్మ కాలేజీలో లెక్చరర్‌గా పనిచేసే రోజుల్లో రావినూతల విశ్వనాథం తనకు ఆత్మీయ మిత్రుడని, ఆయన స్నేహంలో ఎన్నో మధుర స్మృతులు ఉన్నాయని తెలిపారు. రాజకీయాలకు వెళ్లినప్పుడు ఎన్నో అమూల్యమైన సలహాలు తనకు ఇచ్చారన్నారు. సభకు ప్రకాశం జిల్లా రచయితల సంఘ అధ్యక్షుడు పొన్నూరు వెంకట శ్రీనివాసులు అధ్యక్షత వహించగా, పత్రా శివ, శ్రీపతి ప్రకాశం, సీవీఎల్ సుబ్రహ్మణ్యం, సాల్మాన్ రాజు, కల్లగుంట కృష్ణయ్య, మద్దాలి మాధవరావు, గురువారెడ్డి, విశ్వనాథం కుటుంబ సభ్యులు పాల్గొని మాస్టారు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంగీత విభావరి నిర్వహించారు.

ఘనంగా గంగమ్మ తల్లి పొంగళ్ల ఉత్సవం



గంగమ్మతల్లి దర్శనానికి బారులు తీరిన భక్తులు



ప్రత్యేక అలంకరణలో గంగమ్మ తల్లి

చీరాల అర్బన్: పట్టణంలోని యాదవపాలెంలో వేంచేసియున్న గంగమ్మ అమ్మవారి పొంగళ్ల ఉత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి ఆలయం వద్ద అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో ఆలయం వద్దకు చేరుకొని పొంగళ్లు, వడపప్పు, పానకం, చలివిడిని అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. మేళతాళాలు, కనక తప్పెట్లుతో అమ్మవారి నగరోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి జలశుద్ధి కార్యక్రమం నిర్వహించారు. భక్తులు ఆలయం వద్దకు చేరుకొని మొక్కులు చెల్లించారు. అనంతరం కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా అమ్మవారి పొంగళ్ల ఉత్సవం నిర్వహిస్తున్నామని, ముఖ్యంగా గంగమ్మ అమ్మవారు ఎంతో మహిమ గల దేవతని, కోరిన కోర్కెలు నెరవేరుస్తుందన్నారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు.

రూ.50 కోట్లతో సేవా కార్యక్రమాలు



ఉచిత వైద్య శిబిరంలో పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

చీమకుర్తి: ప్రపంచ వ్యాప్తంగా 2 వేల వాసవీ క్లబ్‌ల ద్వారా ప్రతి ఏటా డాన్ టు డెస్క్ కార్యక్రమం పేరుతో రూ.50 కోట్ల విలువైన సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు అంతర్జాతీయ వాసవీ క్లబ్ వైస్ ప్రెసిడెంట్ నాదెండ్ల శ్రీనివాసులు తెలిపారు. సంతనూతలపాడు వాసవీ క్లబ్, మహిళా క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన డాన్ టు డెస్క్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా సంతనూతలపాడులో ఒంగోలుకు చెందిన ఉపాస్ ఆస్పత్రి సహకారంతో ఏర్పాటు చేసిన మెగా వైద్యశిబిరాన్ని వాసవీక్లబ్ ప్రతినిధులు ప్రారంభించారు. 200 మంది రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులందించారు. దాంతో పాటు సంతనూతలపాడు కూడళ్లకు రూ.30 వేల విలువైన 8 సిమెంటు బెంచీలు అందించారు. పేద మహిళలకు చీరలు, బియ్యం, నిత్యావసర వస్తువులు, పేద రైతులకు ఎరువుల బస్తాలు అందించారు. మాజీ సైనిక ఉద్యోగి సుబ్బనాచారిని శాలువా కప్పి సత్కరించారు. అనంతరం సంతనూతలపాడు మాజీ సర్పంచ్ శిఘాకొల్లి నరసింహరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వాసవీ, మహిళా క్లబ్ అధ్యక్షులు జీ బదరీనారాయణ, జీ పద్మజ, సభ్యులు వీఎస్ ప్రసాదరావు, జీఎల్ ప్రసాదరావు, రంగనాథ్, చంద్రశేఖర్, సత్యనారాయణ, శరత్‌బాబు, పబ్బిశెట్టి శ్రీనివాసరావు, స్థానికులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో బాలుడికి తీవ్రగాయాలు

బల్లికురవ: బయట ఆడుకుంటున్న బాలుడిపై కుక్కలు మూకుమ్మడిగా దాడి చేయడంతో బాలుడు తీవ్ర గాయాల పాలయ్యాడు. ఈ ఘటన ఆదివారం మండలంలోని కొప్పెరపాడు గ్రామంలో జరిగింది. అందిన సమాచారం మేరకు గ్రామంలోని సుగాలి తండాకు చెందిన డెంబావత్ అయుష్ నాయక్ ఇంటి ముందు తోటిపిల్లలతో ఆడుకుంటుండగా కుక్కలు ఒక్కసారిగా దాడి చేసి బాలుని తల, ముఖం, కాళ్లు చేతలపై తీవ్రంగా గాయపరచాయి. తండ్రి పేతురూ నాయక్ హుటాహుటిన బాలుడిని అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు చికిత్స నిమిత్తం తరలించారు.

భక్తి శ్రద్ధలతో అంకాలమ్మ పొంగళ్లు



ఆలయం వద్ద నైవేద్యాలతో భక్తులు



బారులు తీరిన కుంకుమ బండ్లు

కొనకనమిట్ల: మండలంలోని గార్లదిన్నె గ్రామంలో ఆదివారం గ్రామ దేవత అంకాలమ్మతల్లికి గ్రామస్తులు ఉత్సవం నిర్వహించి పొంగళ్లు పెట్టారు. అమ్మా అంకాలమ్మా దీవించమ్మా అంటూ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి విశేష పూజలు నిర్వహించి అమ్మవారిని దర్శించుకొని పునీతులయ్యారు. అమ్మవారికి పసుపు, కుంకుమ, చీర, జాకెట్‌లు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కోరిన కోర్కెలు తీర్చే అమ్మవారిగా కుంకుమ బండ్లు కట్టి ఉత్సవంగా అమ్మవారి ఆలయం వద్దకు చేరి మొక్కులు తీర్చుకున్నారు. ముందుగా ఉత్సవం నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో బోనాలతో నైవేద్యాలు సమర్పించి సకాలంలో వర్షాలు పడి గ్రామం పాడి పంటలతో పచ్చగా ఉండాలని కోరుతూ అమ్మవారి దర్శనం చేసుకున్నారు. ఉత్సవం సందర్భంగా అంకాలమ్మతల్లి ఆలయాన్ని రంగు రంగుల దీపాలతో అలంకరించారు.

పోలేరమ్మ తల్లికి పూజలు

మార్కాపురం టౌన్: పట్టణ శివారులో వెలసిన శ్రీ అల్లూరి పోలేరమ్మ ఆలయంలో అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలను అర్చకులు ఘనంగా నిర్వహించారు. పోలేరమ్మ తల్లి భక్తులను చల్లంగా చూడాలని భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. పోలేరమ్మ భక్తుల కోర్కెలు తీర్చే తల్లిగా పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల్లో ప్రసిద్ధి చెందింది. ఆలయ అర్చకులు వెంకటేశ్వర్లు అమ్మవారికి ప్రత్యేక అలంకారాలు చేసి కుంకుమార్చన, అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఆలయ పరిధిలో ఉన్న నాగమయ్య పుట్టకు, నాగమయ్య శిలలకు ప్రత్యేక పూజలను భక్తులు నిర్వహించారు. భక్తులు ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు వండి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. భక్తులకు ఏర్పాట్లను ఆలయ ఈవో చెన్నకేశవరెడ్డి, ధర్మకర్తలు, ఆలయ సిబ్బంది శ్రీధర్‌రెడ్డి, తదితరులు పర్యవేక్షించారు.

కోటా సత్యమాంబదేవికి ప్రత్యేక పూజలు

బేస్తవారిపేట: మండలంలోని గొట్టమిండ్ల కోటా సత్యమాంబదేవి, బేస్తవారిపేట, పాపాయిపల్లె గ్రామాల్లోని పోలేరమ్మ ఆలయాల్లో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కోటా సత్యమాంబదేవి ఆలయంలో అమ్మవారికి అర్చనలు, సహస్ర నామ పూజలు, కుంకుమపూజలు, అఖండహారతి పూజలు చేశారు. అమ్మవారికి బోనాలు సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత



బాధితుడికి సెల్‌ఫోన్ అందిస్తున్న ఎస్సై తిరుపతిరావు

జే.పంగులూరు: పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను బాధితుడికి అందజేశారు పోలీసులు. మండల పరిధిలోని జాగర్లమూడివారిపాలేనికి చెందిన ఉంగరాల ప్రసాద్‌కు ఆదివారం రేణింగవరం ఎస్సై తిరుపతిరావు సెల్ ఫోన్ అందించాడు. ప్రసాద్ గ్రామంలోని రోడ్డుపై ఉండగా బైకుపై ఇద్దరు వ్యక్తులు వచ్చి అడ్రసు అడిగి వెంటనే జేబులోని సెల్‌ఫోన్ లాక్కొని ఉడాయించారు. అదే రోజు బాధితుడు ప్రసాద్ రేణింగవరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు సెల్‌ఫోన్ ఈఎంఐ సహాయంతో సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి దొంగల నుంచి సెల్ ఫోన్ రాబట్టి బాధితుడికి అప్పగించారు.